# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 329 | పేజీలు: 5 | వెల: రూ.4/- | బుధవారం 2 జులై 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## సిగాచీ పేలుడులో 51 మంది ఆహుతి

### మృతుల్లో ఆరుగురు తెలుగువారు

**హైదరాబాద్/ సంగారెడ్డి, జూలై 1 (నమస్తే ఉదయం):**

సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో సోమవారం ఉదయం చోటు చేసుకున్న ప్రమాదం తెలుగు రాష్ట్రాల్లో విషాదం నింపింది. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే ఇది అతిపెద్ద ప్రమాదం. ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య 51కి పెరిగింది. శిథిలాలను తొలగిస్తున్న కొద్దీ కార్మికులు, సిబ్బంది మృతదేహాలు వెలికి వస్తూనే ఉన్నాయి. ప్రమాదంలో 36 మంది మరణించినట్టు మంగళవారం సాయంత్రం అధికారులు ప్రకటించారు. ఇప్పటి వరకు 14 మందిని గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మిగతా వారిని గుర్తించాల్సి ఉన్నది. మరోవైపు, తమ వారు బతికున్నారో, లేదో తెలియక బాధిత కుటుంబ సభ్యులు నరకం అనుభవిస్తున్నారు. మృతుల్లో ఎక్కువమంది బీహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాలకు చెందినవారే.



### పరిశోధనాభివృద్ధి, ఆవిష్కరణల్లో

## ప్రైవేటుకు ప్రోత్సాహం

**ఆర్‌డీఐలో ప్రైవేటు రంగ పెట్టుబడులకు వడ్డీరహిత ఫైనాన్సింగ్**

**ఈ స్కీమ్‌కు రూ.లక్ష కోట్లు కేటాయింపునకు కేబినెట్ ఆమోదం**

**జాతీయ క్రీడా విధానం -2025కు కేంద్ర కేబినెట్ ఆమోదం**

**కేబినేట్ కీలక నిర్ణయాలు వెల్లడించిన మంత్రి అశ్వినీ వైష్ణవ్**

**న్యూఢిల్లీ, జూలై1 ( నమస్తే ఉదయం)**

పరిశోధనాభివృద్ధి, ఆవిష్కరణల రంగంలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించ డమే లక్ష్యంగా పరిశోధన- అభివృద్ధి- ఆవిష్కరణ పథకానికి కేంద్ర కేబినేట్ ఆమోదం తెలిపింది. ఈ స్కీమ్‌కు రూ.లక్ష కోట్లు కేటాయింపునకు పచ్చజెండా ఊపింది. ఆర్‌డీఐలో ప్రైవేటు రంగ పెట్టుబడులను ప్రోత్సహించేందుకు తక్కువ వడ్డీ రేటు లేదా వడ్డీరహిత దీర్ఘకాలిక ఫైనాన్సింగ్ లేదా రీఫైనాన్సింగ్ అందించడమే ఈ పథకం లక్ష్యమని కేంద్రం పేర్కొంది. ప్రైవేట్ రంగం నిధుల విషయంలో ఎదుర్కొనే అడ్డంకులు, సవాళ్లను అధిగమించేం దుకు దీన్ని డిజైన్ చేసినట్లు తెలిపింది. ప్రధానమంత్రి అధ్యక్షతన ఉన్న అనుసంధన్ జాతీయ పరిశోధనా ఫౌండేషన్

..మిగతా 2లో

### తెలంగాణకు మరణ శాసనం రాసిన

# కేసీఆర్, హరీష్ రావు

**గోదావరి మిగులు జలాలపై ఏపీకి అనుకూలంగా నిర్ణయం**

**రాష్ట్ర నీటి హక్కులు కాపాడడంలో కేసీఆర్ పూర్తిగా విఫలం**

**కాళేశ్వరంతో లక్షకోట్లు వృధా చేసిన కేసీఆర్**

**అది పూర్తి చేయాలంటే మరో 50వేల కోట్లు ఖర్చు చేయాలి**

**మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి**



**హైదరాబాద్, జూలై1 ( నమస్తే ఉదయం)**

తెలంగాణ జలాల విషయంలో రాజీపడేది లేదని సీఎం రేవంత్‌రెడ్డి కుండబద్దలు కొట్టారు. రాష్ట్రానికి చెందిన నీటిహక్కులు కాపాడటంలో రాజకీయంగా, సాంకేతికంగా, న్యాయపరంగా పోరాడుతూనే ఉంటామని చెప్పారు. ప్రజాభవన్‌లో 'గోదావరి–బనకచర్ల'పై ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చింది. ప్రజాభవన్ లో బనకచర్ల ప్రాజెక్టు పైనా తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు,ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'నీటిపారుదల శాఖను పదేళ్లపాటు కేసీఆర్, హరీశ్‌రావు చూశారు. రాష్ట్ర నీటి హక్కులను వాళ్లు కాపాడతారని అందరూ భావించారు. కానీ వాళ్లే నష్టం చేశారు. 811 టీఎంసీల్లో తెలంగాణకు 299 టీఎంసీలు చాలని.. 68 శాతం జలాలు ఏపీకి కేటాయిస్తే అభ్యంతరం లేదని 2015లో సంతకం చేశారు. 2015లో కేసీఆర్, హరీశ్‌రావు చేసిన సంతకాలే తెలంగాణకు మరణశాసనంగా మారాయి. కృష్ణా పరివాహక ప్రాంతం పరంగా చూస్తే తెలంగాణకే ఎక్కువ దక్కాలి. ప్రాజెక్టులు పూర్తికాకపోవడంతో కేటాయించిన 299 టీఎంసీలు కూడా వాడుకోలేని పరిస్థితి వచ్చింది. ఉమ్మడి ఏపీలో ప్రారంభించిన ప్రాజెక్టులను పదేళ్లపాటు పట్టించుకోలేదు. ఏపీ మాత్రం పూర్తి చేసుకున్న ప్రాజెక్టులకు నీటిని తరలించుకుపోతోందని రేవంత్‌రెడ్డి అన్నారు. నీళ్ళకు తెలంగాణ ప్రజలకు అనుబంధం ఉంది.. నీళ్లలో జరిగిన అన్యాయం పైనే

..మిగతా 2లో

# బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు

**సిగాచీ యాజమాన్యంపై సీఎం రేవంత్ మండిపాటు**

**మృతుల కుటుంబాలకు కోటి పరిహారం ఇప్పిస్తామని ప్రకటన**

**సంగారెడ్డి, జూలై1 ( నమస్తే ఉదయం)**

సంగారెడ్డి జిల్లా పఠాన్ చెరు పాశమైలారం ఘటన మృతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇప్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. అదే విధంగా తీవ్రంగా గాయపడి ఎలాంటి పని చేసుకోలేని స్థితిలో ఉన్న బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు, స్వల్పంగా గాయపడి, తిరిగి పనిచేసుకోగలిగే వారికి రూ.5 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. చనిపోయిన వారి పిల్లల చదువుల బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని, గురుకులాలో సీట్ల గురించి మాట్లాడాలని అధికారులకు సూచించామని చెప్పారు. బాధితులకు

..మిగతా 2లో






## జీఎస్‌టీ మైలురాయి లాంటి సంస్కరణ

**దేశ ఆర్థిక ముఖచిత్రానికే కొత్త రూపు: ప్రధాని మోదీ**

**జీఎస్‌టీ 8వ వార్షికోత్సవం**

**ఆర్థిక అన్యాయానికి, కార్పొరేట్ మిత్రపక్షానికి క్రూరమైన సాధనం అంటున్న రాహుల్ గాంధీ**

**న్యూఢిల్లీ, జూలై1 ( నమస్తే ఉదయం)**

భారత ఆర్థిక వ్యవస్థలో వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ) మైలురాయి లాంటి సంస్కరణ అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. జీఎస్‌టీ 8వ వార్షికోత్సవం సందర్భంగా ఎక్స్‌లో పోస్ట్ చేసిన మోదీ భారత ఆర్థిక ముఖచిత్రానికి వస్తు,సేవల పన్ను కొత్త రూపు ఇచ్చిందని అన్నారు. మరోవైపు 'ఆర్థిక అన్యాయానికి, కార్పొరేట్ మిత్రపక్షానికి క్రూరమైన సాధనం-జీఎస్‌టీ' అని రాహుల్ గాంధీ విమర్శించారు. జీఎస్టీ- చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు భారం తగ్గించి, వ్యాపారం సులభతరం చేసిందని ప్రధాని మోదీ తెలిపారు. దేశ ఆర్థికాభివృద్ధికి జీఎస్‌టీ శక్తివంతమైన ఇంజిన్‌లా పనిచేస్తోందని మోదీ కొనియాడారు. భారత మార్కెట్‌ను ఏకీకృతం చేసి రాష్ట్రాలను సమాన భాగస్వాములను చేస్తూ

..మిగతా 2లో



## కార్యకర్తల త్యాగం వల్లే ఈ స్థాయికి

**కలసికట్టుగా పార్టీ విజయానికి కృషి**

**బీజేపీలో పాత, కొత్త భేదం లేదు**

**స్థానిక ఎన్నికల నుంచి విజయం నమోదు చేద్దాం**

**కాంగ్రెస్ ఫేక్ యూనివర్సిటీని ఎదుర్కొంటాం**

**బీజేపీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన రామచంద్రరావు**

**హైదరాబాద్, జూలై 1 ( నమస్తే ఉదయం)**

ఎంతో మంది కార్యకర్తల త్యాగాల ఫలితంతోనే బీజేపీ ఈ స్థాయికి చేరుకుందని బీజేపీ నూతన రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. తనకు రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వడం గర్వంగా భావిస్తున్నాను.. ప్రతి కార్యకర్త గర్వించాలి.. అందరం కలిసికట్టుగా పని చేద్దాం అని పిలుపునిచ్చారు. తాను పేరుకే అధ్యక్షుడిని.. నేనెప్పటికీ కార్యకర్తనే.. మీ సేవకుడినే పేర్కొన్నారు. పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. కిషన్ రెడ్డి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ.. కార్యకర్తలే ఈ పార్టీకి నిజమైన సారథులు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో జనసంఘ్ అభ్యర్థి పోటీ చేస్తే వెయ్యి ఓట్లు మాత్రమే

..మిగతా 2లో

### పాశమైలారం ఘటన

# దురదృష్టకరం

**ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి**

**సహాయక చర్యలు పరిశీలించి బాధితులకు పరామర్శ.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పర్యటన**

**సంగారెడ్డి, జూలై1 ( నమస్తే ఉదయం)**

పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి పరిశ్రమలో పేలుడు ఘటన చాలా దురదృష్టకరమైన సంఘటన అని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు 48 మంది మృతదేహాలు సంఘటన స్థలంలో లభ్యమయ్యాయని చెప్పారు. ఇంకా 11 మంది ఆచూకీ లభ్యం కావాల్సి ఉందన్నారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి తెలిపారు. మంగళవారం సంగారెడ్డి జిల్లాలోని పాశమైలారంలో ఘటన స్థలాన్ని బీజేపీ తెలంగాణ రాష్ట్ర కొత్త అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావుతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



మాట్లాడుతూ.. ఈ సంస్థ ఫార్మా కంపెనీలకు రా మెటీరియల్ అందిస్తుందన్నారు. గతంలో సైతం ఒక పరిశ్రమలో షార్ట్ సర్క్యూట్ కారణంగా 11 మంది చనిపోయారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఉన్నతాధికారులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేయాల్సి ఉందని ప్రభుత్వానికి ఆయన సూచించారు. పరిశ్రమల్లో తనిఖీలు, లంచాల కోసం జరుగుతున్నాయా..? లేక నామ్ కే వాస్తే ప్రకారం

..మిగతా 2లో

# తెలంగాణకు మరణశాసనం రాసిన
# కేసీఆర్, హరీష్ రావు

మొదటి పేజీ తరువాయి...

తెలంగాణ ఉద్యమం కొనసాగింది.. నీళ్ల విషయంలో అందరిదీ ఏకాభిప్రాయమే.. తెలంగాణ హక్కులు కాపాడాలనేది మా ఆలోచన అన్నారు. అయితే, కేసీఆర్, హరీష్ రావుల దగ్గరే తొమ్మిదిన్నరేళ్ల పాటు నీటి పారుదల శాఖ ఉంది.. వాళ్ళ మీద పెట్టిన నమ్మకం వమ్ము చేశారు.. వాళ్ళు తీసుకున్న నిర్ణయాలు తెలంగాణకి గుది బండలాగా మారింది.. నికర జలాల మీద కేటాయింపుల్లో స్పష్టత ఉ ందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇక, కృష్ణా నదిలో 811 టీఎంసీలలో 299 టీఎంసీలు తెలంగాణకు చాలు అని కేసీఆర్ సంతకం చేసి వచ్చిండు అని ముఖ్యమంత్రి రేవంత్ ఆరోపించారు. అప్పుడు కూడా మేం అభ్యంతరం వ్యక్తం చేశాం.. పరివాహక ప్రాంతాన్ని బట్టి నీటి కేటాయింపులు చేయాలని మేం వాదించాం.. 2020లో కూడా 299 టీఎంసీలు చాలు అని చెప్పారు.. కేసీఆర్, హరీష్ రావులు నీటి కేటాయింపులు సాధించలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులు పూర్తి చేయలేదు.. కేంద్రానికి కూడా శాశ్వత పరిష్కారం ఇవ్వాలని ముందుకు రాలేదు.. కేసీఆర్ తన దాహం తీర్చుకోవడానికి.. కాళేశ్వరం పేరుతో అంచనాలు మార్చాడని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి షేప్ రావాలంటే.. ఇంకో 50 వేల కోట్లు కావాలి.. లక్ష కోట్లు ఖర్చు చేసి 50 వేల ఎకరాలకు నీరు ఇచ్చారు .. 7 వేల కోట్ల కరెంట్ బిల్లులు అయ్యాయి.. మరో 118 టీఎంసీల నీటిని సముద్రంలో కలిపారని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. అయితే, గోదావరిని పూర్తిగా వాడుదామంటే నీళ్ల కేటాయింపు సమస్య, నిధుల సమస్య వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ చెప్తున్న అబద్దాలు.. మీరు జనంలోకి తీసుకెళ్లాలి అని సూచించారు. నదులు పునరుజ్జీవం కోసం కాదు.. బీఆర్ఎస్




పునరుజ్జీవం కోసం ప్రయత్నం చేస్తున్నారు అని మండిపడ్డారు. అందుకు ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు కుట్రలు చేస్తున్నారు.. ఫామ్ హౌస్ లో ఉండి క్షుద్ర పూజలు చేస్తున్నారని ఆరోపించారు. ఉమాభారతి దగ్గరకి వెళ్లి 3 వేల టీఎంసీల నీళ్ళు ఉన్నాయని కేసీఆర్ అన్నాడో అప్పుడే సమస్య మొదలైంది. చంద్రబాబు మేల్కొని.. తెలంగాణనీ ఇరకటంలోకి నెట్టిండు.. చంద్రబాబు వచ్చినా.. జగన్ వచ్చినా.. గోదావరి నీళ్లు తీసుకుపోతామన్నారు.. రోజా ఇంటికి వెళ్ళి.. గోదావరి నీళ్లు ఇస్తామని కేసీఆర్ అన్నారు.. కేసీఆర్ వైఖరి.. మా ఇంటికి వస్తే ఏం తెస్తావు.. మీ ఇంటికి వస్తె ఏం ఇస్తావు అన్నట్టు ఉందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఏపీ ప్రతిపాదిత బనకచర్ల ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతులు తిరస్కరించడం తెలంగాణ ప్రభుత్వ విజయమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్‌తో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్న తెలంగాణ ప్రభుత్వ వాదనలను కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని.. అందుకే బనకచర్ల ప్రాజెక్ట్?కు పర్యావరణ అనుమతులు తిరస్కరించిందన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతులు తిరస్కరించడం తెలంగాణ ప్రభుత్వం సాధించిన విజయమని పేర్కొన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్‌కు సంబంధించి ఏపీ సీఎం చంద్రబాబు చేసిన వాదనలు పూర్తిగా అవాస్తమని అన్నారు.

కాగా, ఏపీ ప్రతిపాదిత బనకచర్ల ప్రాజెక్ట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బనకచర్ల ప్రాజెక్ట్?కు పర్యావరణ అనుమతులు ఇచ్చేందుకు నిరాకరించింది. బనకచర్ల ప్రాజెక్ట్?కు పర్యావరణ అనుమతులు ఇవ్వలేమని ఆంధ్రప్రదేశ్‌కు తేల్చిచెప్పింది. ఈ మేరకు బనకచర్ల ప్రాజెక్ట్ కోసం ఆంధ్రప్రదేశ్ పంపిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం తిప్పిపంపింది. బనకచర్ల ప్రాజెక్ట్‌కు అనుమతులు ఇవ్వాలంటే సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) పరిశీలించాల్సి ఉందని.. ఈ మేరకు సీడబ్ల్యూసీని అప్రోచ్ కావాలని ఏపీకి సూచించింది. సీడబ్ల్యూసీతో కలిసి ఫ్లడ్ వాటర్ అవేలబులిటి అస్సెస్ చేయాలని పేర్కొంది. అంతరాష్ట్ర జల వివాదానికి క్లియరెన్స్ తెచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్‌కు సూచించిందని అన్నారు.

## బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు

మొదటి పేజీ తరువాయి...

ప్రభుత్వం తరపున వైద్యం అందించే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. సిగాచి ఫ్యాక్టరీ ప్రమాదాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కంపెనీ యాజమాన్యం, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంగళవారం మంత్రులు, అధికారులతో కలిసి ప్రమాద స్థలాన్ని పరిశీలించిన సీఎం రేవంత్.. ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణలో ఇన్ని ప్రాణాలను బలిగొన్న ప్రమాదం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఫైర్, హైడ్రా, డిజాస్టర్, రెవెన్యూ శాఖల సమన్వయంతో సహాయక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ ఘటనలో ఎలాంటి సహాయక చర్యలు తీసుకోవాలో ఆదేశించడం జరిగిందని చెప్పారు. ఈ ఘటనలో అధికారిక సమాచారం ప్రకారం 36 మంది చనిపోయారని సీఎం రేవంత్ తెలిపారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో 143 మంది ఉ న్నారని, 58 మంది వివరాలు అధికారుల దృష్టిలోకి వచ్చాయని, మిగతా వారు శిథిలాల కింద ఉన్నారా లేక భయంతో టచ్ లోకి రాలేదా అనేది స్పష్టంగా తెలియదని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రణాళికలన సిద్ధం చేస్తామని చెప్పారు. ఘటనలపై కమిటీ రిపోర్ట్ ఇస్తుందని.. ప్రాథమిక సమాచారం తర్వాత ప్రమాదపై పూర్తి వివరాలు చెబుతామని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని హామీ ఇస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి ఘటనలను భవిష్యత్ లో జరగకుండా ఉండేందుకు.. ఓ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సీఎం రేవంత్ చెప్పారు.

## జీఎస్టీ
## మైలురాయి లాంటి సంస్కరణ

మొదటి పేజీ తరువాయి...
నిజమైన సమాఖ్య వ్యవస్థకు అద్దంపడుతోందని చెప్పారు.

**పేదలను శిక్షించడానికే జీఎస్టీ : రాహుల్ గాంధీ**

జీఎస్టీలో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని రాహుల్ గాంధీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఇది కేవలం కొద్ది మందికి మాత్రమే కాకుండా అన్ని వర్గాల ప్రజలకు ఉ పయోగపడే పన్ను విధానంగా ఉండాలి. అప్పుడే చిన్న వ్యాపారుల నుంచి రైతుల వరకు ప్రతి భారతీయుడు దేశ అభివృద్ధిలో భాగస్వామిగా ఉండగలడు. మోదీ హయాంలోని జీఎస్టీ పన్ను సంస్కరణ కాదు. ఇది ఆర్థిక అన్యాయానికి, కార్పొరేట్ మిత్రపక్షానికి ఉపయోగపడే క్రూరమైన సాధనం మాత్రమే. ఇది పేదలను శిక్షించడానికి, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను నాశనం చేయడానికి, రాష్టాలను అణగదొక్కడానికే ఉపయోగపడుతోంది. కేవలం ప్రధాన మంత్రికి మిత్రులైన కొంత మంది బిలియనీర్లకు లాభం చేకూర్చడానికే ఇది రూపొందించబడింది' అని రాహుల్ గాంధీ ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

'గుడ్ అండ్ సింపుల్ ట్యాక్స్ అని వాగ్దానం చేశారని, కానీ ఆ స్థానంలో 900 సార్లు సవరించిన ఐదు శ్లాబుల పన్ను విధానం వచ్చింది. కారామెల్ పాప్‌కార్న్ నుంచి క్రీమ్ బన్స్ వరకు అన్ని పన్నుల వలలో చిక్కుకున్నాయి. పన్ను విధానం పెద్ద కార్పొరేట్స్‌కే మేలు చేసింది. ఎందుకంటే వాటిలో ఉన్న లొసుగులను చెప్పగలిగే అకౌంటెంట్స్ వారి దగ్గర ఉ ంటారు. కానీ, చిన్న వ్యాపారులు, ఎంఎస్ఎంఈ, సాధారణ వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. జీఎస్టీ పోర్టల్ సైతం ప్రజలను వేధించే అంశంగానే మారింది. ఇక భారత్ లో ఎక్కువ ఉపాధిని కల్పించే ఎంఎస్ఎంఈలు ఎక్కువగా నష్టపోతున్నాయి. జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి 18 లక్షలకు పైగా వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. ఇప్పుడు ప్రజలు టీ నుంచి ఆరోగ్య బీమా వరకు ప్రతిదానిపై జీఎస్టీ చెల్లిస్తున్నారు. కానీ కార్పొరేట్ సంస్థలు మాత్రం ఏటా రూ.లక్ష కోట్లకు పైగా పన్ను మినహాయింపులు పొందుతున్నాయి' అని రాహుల్ గాంధీ విమర్శించారు.

**'బీజేపీయేతర రాష్ట్రాలపై పగ'**

పెట్రోల్, డీజిల్‌ను కావాలనే జీఎస్టీ పరిధిలోకి తేలేదని, దీని వల్ల రైతులు, రవాణా వ్యాపారులు, సాధారణ ప్రజలు నష్టపోతున్నారని రాహుల్ గాంధీ విమర్శించారు. బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాలపై పగతో జీఎస్టీ బాకీలను ఆయుధాలుగా ఉపయోగిస్తున్నారు. మోదీ ప్రభుత్వ సమాఖ్య వ్యతిరేక ఎజెండాకు ఇది నిదర్శనమని ఆరోపించారు. జీఎస్టీని ఓ దూరదృష్టి గల ఆలోచనగా యూపీఏ ప్రభుత్వమే మొదలుపెట్టిందని అన్నారు. దాని లక్ష్యం భారతదేశ మార్కెట్లను ఏకీకృతం చేయడం, పన్నుల వ్యవస్థను సరళీకృతం చేయడమేనని చెప్పారు. కానీ, తగిన విధంగా అమలు చేయకపోవడం, రాజకీయ పక్షపాతం, అధికారం దుర్వినియోగం వల్ల ఈ ఆలోచన వక్రీకరించబడిందని చెప్పారు. జీఎస్టీ ప్రజలకోసం ఉ ండాలి, వ్యాపారానికి అనుకూలంగా ఉండాలి. నిజమైన సమాఖ్య స్ఫూర్తితో అమలులోకి రావాలని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

17 పన్నులు, 13 సెస్సులను కలిపి ఒకే పన్నుగా 2017 జులై 1 నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చింది. తొలి ఏడాది మొదటి 9 నెలల్లోనే 7.40లక్షల కోట్ల జీఎస్టీ వసూలుకాగా, 2024-25లో 22.08 లక్షల కోట్లు వసూలై రికార్డు సృష్టించింది.




## కార్యకర్తల త్యాగం వల్లే ఈ స్థాయికి

మొదటి పేజీ తరువాయి...

వచ్చాయి.. కమ్యూనిస్టు పార్టీ గెలిచింది.. ఆనాడు జనసంఘ్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు టపాసులు కాల్చారు.. ఇదేందని కమ్యూనిస్టులు అడిగితే గత ఎన్నికల కంటే ఎక్కువ ఓట్లు వచ్చాయని సంబురాలు చేసుకుంటున్నామని చెప్పారు.. ఇవాళ అదే ఉ త్సాహంతో తెలంగాణలో 8 ఎమ్మెల్యే, 8 ఎంపీ, 3 ఎమ్మెల్సీ సీట్లను కైవసం చేసుకున్నామని రామచందర్ రావు తెలిపారు. అయితే, పార్టీ కోసం సైకిల్ పై రాష్ట్రమంతటా తిరుగుతూ ఎంతో కష్టపడ్డామని టీబీజేపీ చీఫ్ రామచందర్ రావు పేర్కొన్నారు. బీజేపీ ఈ స్థాయికి వచ్చిందంటే.. ఎంతో మంది కార్యకర్తలు, నాయకులు త్యాగాలున్నాయి.. మీ చెమట కష్టంతోనే బీజేపీ ఎదిగింది.. అందరి ఆశీస్సులతో నేను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికవడం గర్వంగా ఉంది.. ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. నక్సలైట్ల తూటాలకు బలైన బీజేపీ నాయకుల బలిదానాల వల్లే పార్టీ ఈ స్థాయికి ఎదిగింది.. బీజేపీ మాస్ క్యాడర్ పార్టీ, సిద్ధాంత బలమున్న పార్టీ.. కలిసికట్టుగా గోల్కొండ కోటపై కాషాయ జెండా ఎగరేద్దామని తెలిపారు. బీజేపీలో కొత్త, పాత అనే పంచాయతీ లేదు.. నది ప్రవహించాలంటే కొత్త నీరు రావాల్సిందే అన్నారు. తెలంగాణ యువత రాజకీయాల్లోకి రావాల్సిందే అని రామచందర్ రావు పిలుపునిచ్చారు. ఇక, యువకులారా.. మహిళలారా.. బీజేపీలోకి రండి అంటూ రామచందర్ రావు పిలుపునిచ్చారు. 33 శాతం రిజర్వేషన్ల అమలుతో మహిళలకు ఎన్నో అవకాశాలు రాబోతున్నాయి.. తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారు.. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు గెలుపే లక్ష్యంగా పని చేస్తాను.. బీఆర్ఎస్, కాంగ్రెస్ వాట్సాప్ యూనివర్శిటీలను పెట్టుకుని ఫేక్ న్యూస్ ను ట్రోలింగ్ చేస్తున్నారు.. స్వామి వివేకానంద చెప్పిన మాటలను గుర్తు తెచ్చుకుని పోరాడుదాం.. మీకు దమ్ముంటే.. నేరుగా ఎదురుగా పోరాడదాం.. నేను క్రిమినల్ లాయర్ ను.. ఫేక్ న్యూస్ సూత్రధారులను బోనులో నిలబెట్టేందుకూ వెనుకాడనని తేల్చి చెప్పారు. రామచంద్రరావు సౌమ్యుడినే.. యుద్ధంలోకి దిగితే యోధుడినే.. కత్తి దూయడంలో ముందుంటానని చెప్పుకొచ్చారు. ఇక, తెలంగాణ ప్రజల తరపున అలుపెరుగని పోరాటం చేస్తానని తెలంగాణ కమలం పార్టీ అధినేత తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ, అమిత్ షా, జేపీ నడ్డా, బీఎల్ సంతోష్ తదితరులు నాయకత్వంలో వారి సహకారంతో ముందుకెళ్తామన్నారు. 14 కోట్ల సభ్యత్వాలతో ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా భాజపా ఉంది. అలాంటి రాజకీయ పార్టీ రాష్ట్ర శాఖకు అధ్యక్షుడినయ్యా. తెలంగాణ అధ్యక్షుడిగా నన్ను ప్రకటించడం గర్వంగా భావిస్తున్నా. కార్యకర్తగానే పనిచేస్తా. పార్టీలో నాయకులంతా సమష్టిగా పనిచేస్తారు. కొత్తపాత తేడా లేదు.. ఎవరైనా భాజపాలో చేరినప్పటి నుంచే పార్టీ వ్యక్తులు. కొత్తనీరు రావాలి. యువత, మహిళలు భాజపాలో చేరాలి. పార్టీని బలపరచాలి. స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి. కాంగ్రెస్ పార్టీ ఫేక్ న్యూస్ యూనివర్సిటీ నడుపుతోంది. భాజపా నేతలను ట్రోల్ చేస్తున్నారు. రామచందర్‌రావు సౌమ్యుడు కాదు. 14 సార్లు జైలుకు వెళ్లి వచ్చా. విద్యార్థుల కోసం పోరాడి పోలీసుల దెబ్బలు తిన్నాను. ప్రజాస్వామిక పద్ధతిలో ప్రభుత్వంపై పోరాటం చేస్తాను. తెలంగాణ ప్రజల కోసం పోరాడతాను. ప్రజలు, కార్యకర్తలు, నేతలు కలిసి రావాలి' అని రామచందర్‌రావు అన్నారు. కార్యక్రమంలో కిషన్ రెడ్డి, లక్ష్మణ్, ఈటెల, డికె అరుణ, తదితరులు పాల్గొన్నారు.



## పాశమైలారం ఘటన దురదృష్టకరం

మొదటి పేజీ తరువాయి...

జరుగుతున్నాయా..? అంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. పొట్ట కూటి కోసం వచ్చి.. ఇలా ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంతో 46 మంది చనిపోవటం చాలా దురదృష్టకరమని పేర్కొన్నారు. సిగాచి సంస్థలకు ఈ ఘటనలో మృతి చెందిన వారి జాబితా వచ్చిన తర్వాత ఆ యా రాష్ట్రాల వారికి తమ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆచూకీ తెలియకుండా పోయిన వారి కోసం త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అలాగే పరిశ్రమల ప్రాంతంలో కచ్చితంగా అంబులెన్స్ ఉండే విధానం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఆ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాల సహకరిస్తామని స్పష్టం చేశారు. శిథిలాల కింద మృతదేహాల కోసం పోలీస్ జాగిలాలను వినియోగించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. చనిపోయిన కుటుంబ సభ్యులు సొంత రాష్ట్రాలకు వెళ్లిపోతానంటే వారికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఇది రాజకీయాలు చేసే సమయం కాదంటూ విలేకర్లు అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కాస్తా ఘాటుగా సమాధానమిచ్చారు.

## ప్రముఖ ఇంద్రజాలికుడు
## బీవీ పట్టాభిరామ్ మృతి



హైదరాబాద్, జూలై1 (నమస్తే ఉదయం) ప్రముఖ ఇంద్రజాలికుడు బీవీ పట్టాభిరామ్ మరణించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఖైరతాబాద్‌లోని స్వగృహంలో ఆయన గుండెపోటుతో మరణించారు. ఆయన వయస్సు 75 సంవత్సరాలు. హిప్నాటిస్టుగా ఆయన పేరు పొందారు. బుధవారం ఉదయం 9 గంటలకు స్వగృహం వద్ద అభిమానుల సందర్శనార్థం పట్టాభిరామ్ పార్థీవదేహాన్ని ఉంచుతారు. అనంతరం మధ్యాహ్నం 3.00 గంటలకు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు వెల్లడించారు. వ్యక్తిత్వ వికాసంపై ఆయన పలు పుస్తకాలు రాశారు. ఆయనకు భార్య జయ, కుమారుడు ప్రశాంత్ ఉన్నారు. 1949లో బీవీ పట్టాభిరామ్ జన్మించారు. ఆయన స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా. ఆయన తండ్రి పేరు రావ్ సాహెబ్ భావరాజు సత్యనారాయణ. కౌమారదశలో కాలి వైకల్యం కారణంగా.. ఆత్మన్యూనతా భావాన్ని జయించేందుకు ఇంద్రజాలికుడిగా, రచయితగా తనను తాను తీర్చిదిద్దుకున్నారు. కాకినాడలో ఉన్నత విద్యను ఆయన అభ్యసించారు. ఆ సమయంలో ఎంబేర్ రావు అనే ఇంద్రజాలికుడి వద్ద ఆ విద్యను ఆయన నేర్చుకున్నారు. ఒకటి రెండు టాలీవుడ్ చిత్రాల్లో సైతం ఆయన నటించారు.దాదాపు అర్థ శతాబ్దం పాటు ఆయన ఇంద్రజాలికుడిగా, సైకాలజీస్టుగా సమాజానికి సేవలందించారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి సైకాలజీ, ఫిలాసఫీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పట్టా పొందారు. అలాగే ఇదే యూనివర్సిటీ నుంచి యోగా, హిప్నోటిజనంలో పీహెచ్‌డీ చేశారు. భారత ఆహార సంస్థలో ఆయన ఉద్యోగిగా విధులు నిర్వహించారు. పలు పురస్కారాలను సైతం ఆయన అందుకున్నారు.

## పరిశోధనాభివృద్ధి, ఆవిష్కరణల్లో
## ప్రైవేటుకు ప్రోత్సాహం

మొదటి పేజీ తరువాయి...

పాలక మండలి.. ఆర్‌డీఐ పథకానికి దిశానిర్దేశర చేస్తుందని పేర్కొంది. కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలను కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. కేంద్ర క్యాబినెట్ మంగళవారంనాడు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రూ.3 లక్షల కోట్లకు పైగా విలువచేసే పలు కీలక పథకాలకు ఆమోదం తెలిపింది. వీటిలో ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ ), పరిశోదన-అభివృద్ధి-ఆవిష్కరణ , జాతీయ క్రీడావిధానం 2025, తమిళనాడులో కీలక మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టు ఉన్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పరిశోధానాభివృద్ధి, ఆవిష్కరణ రంగంలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా రీసెర్చ్ డవలప్‌మెంట్ అండ్ ఇన్నొవేషన్ పథకానికి కేంద్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీనికి రూ.1 లక్ష కోట్లు కేటాయించింది. ఇజ్రాయెల్, యూఎస్, సింగపూర్, జర్మనీ వంటి దేశాల్లో విజయవంతమైన గ్లోబల్ మోడల్స్‌ను అధ్యయనం చేసి అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ రూపొందించిన అంతర్జాతీయ రోడ్‌మ్యాప్ ఆధారంగా ఈ స్కీమ్ ఉంటుంది. ప్రైవేటు రంగం నిధుల విషయంలో ఎదుర్కొనే సవాళ్లను అధిగమించేందుకు దీన్ని డిజైన్ చేసినట్టు తెలిపింది. ఈ పథకం కింద ఆర్డీఐలో ప్రైవేటు రంగ పెట్టుబడులను ప్రోత్సహించేందుకు తక్కువ వడ్డీ, వడ్డీరహిత దీర్ఘకాలిక ÷నాన్సింగ్ అందించనున్నారు.మాన్యుఫాక్చరింగ్ రంగంలో ఉపాధి ఆధారిత ప్రోత్సాహకాల పథకానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రూ.1.07 లక్షల కోట్లతో ఈ పథకాన్ని అమలు చేస్తారు. ఇది మ్యాన్యుఫ్యాక్చరింగ్-డ్రైవెన్ ఎకానమికి కీలక గ్రోత్ ఇంజన్ అని గత బ్జడెట్‌లో వైష్ణవ్ ప్రకటించారు. దేశంలో క్రీడా మౌలిక సదుపాయాలు పెంచడం, క్రీడాకారుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా జాతీయ క్రీడా విధానం -2025కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో పాటు ఉపాధి ఆధారిత ప్రోత్సాహకాల పథకానికి పచ్చజెండా ఊపింది. తద్వారా తయారీ రంగంలో ఉపాధి కల్పించే పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వనుంది. రెండేళ్ల కాలపరిమితిపై రూ.99,446 కోట్లతో ఉపాధి ఆధారిత ప్రోత్సాహక (ఇఒఎ) పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే, తమిళనాడులోని పరమకుడి-రామనాథపురం హైవే నాలుగు లేన్‌ల విస్తరణకు ఆమోదం తెలిపిన క్యాబినెట్.. ఈ ప్రాజెక్టు కింద 46.7 కి.మీల పొడవైన రహదారి నిర్మాణానికి రూ.1853 కోట్ల వ్యయం చేయనుంది. గత దశబ్దా కాలంలో భారతదేశం క్రీడారంగంలో సాధిస్తున్న వృద్ధిని దృష్టిలో ఉంచుకుని జాతీయ క్రీడా విధానం-2025కు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రతిభావంతులైన క్రీడాకారులను అట్టడుగు స్థాయి నుంచి ఉన్నత స్థాయికి తీసుకు వెళ్లడం, కోచింగ్ అవకాశాలు పెరుగుపరచడం, దేశంలోని క్రీడా సదుపాయాలను పటిష్టం చేయడం వంటికి ఈ పథకం ప్రధాన ఉ ద్దేశాలు. దక్షిణ భారతదేశంలో మౌలిక వసతులను మరింత మెరుగుపరచడంలో భాగంగా తమిళనాడులోని పరమకుడి-రామనాథపురం సెక్షన్ల మధ్య నాలుగు లేన్ల నేషనల్ హైవే విస్తరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

### విద్యుత్ ఉద్యోగులు విధి నిర్వహణలో

# సేఫ్టీ పరికరాలు విధిగా ధరించాలి

### విద్యుత్ సైబర్ సిటీ సర్కిల్ ఎస్ ఇ చంద్రశేఖర్



ఉద్యోగులకు సేఫ్టీ పరికరాలు అందజేస్తున్న ఇంజనీర్లు



నార్సింగి, జూలై 1(నమస్తే ఈ) విద్యుత్ ఉద్యోగులు విధి నిర్వహణలో సేఫ్టీ పరికరాలు విధిగా ధరించాలని సైబర్ సిటీ సర్కిల్ ఎస్ ఇ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం ఇబ్రహీంబాద్ విద్యుత్ డివిజన్ పరిధిలోని నెక్నాపూర్ దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యుత్ భద్రత వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...లైన్ క్లియర్ పొందిన పిదపనే లైన్లపై పని చేయాలి. హెల్మెట్ మరియు సేఫ్టీ బెల్ట్ పెట్టుకుని పని చేయాలి. ప్రాణాలు కాపాడటంలో ఎర్తింగ్ అతి ముఖ్యమైనది. కనుక పని ప్రారంభించే ముందు ఎర్త్ తప్పకుండా వాడవలెను. రెండు ట్రాన్స్ ఫార్మర్ల నుండి ఎల్.టి. ఫీడర్లు ఒకే స్థంభం వద్దకు వచ్చినపుడు "అపాయము" "డబుల్ ఫీడరు" అను బోర్డు తప్పనిసరిగా పెట్టవలెను. ఇబ్రహీం బాగ్ విద్యుత్తు డివిజనల్ ఇంజనీర్ ఎం రమేష్ చంద్ర మాట్లాడుతూ...పనిలో ఉన్నప్పుడు సెల్ఫోన్ వాడరాదు, మత్తు పదార్ధములు సేవించరాదన్నారు. అది సేవించినవారికేగాక ఇతరులకు కూడ నష్టం కలగజేస్తుందన్నారు. మీ అజాగ్రత్తవల్ల మన సంస్థకే గాక, మీ కుటుంబానికి కూడా దూరమవుతారని మరువకండి. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు,ఉద్యోగులు జాగ్రత్తలపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మోకిలా అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ మేడి రమేష్, ఇబ్రహీం బాగ్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ అంబేద్కర్, చేవెళ్ల అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ రాజేష్, అసిస్టెంట్ ఇంజనీర్లు హేము నాయక్, ప్రదీప్, శివరామకృష్ణ, కోటేశ్వరరావు, ప్రవీణ్, మణికంఠ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

**రాజేంద్రనగర్ సబ్ డివిజన్ లో...**

రాజేంద్రనగర్ విద్యుత్ సబ్ డివిజన్ ఏడిఈ ఆధ్వర్యంలో విద్యుత్ భద్రత వారోత్సవాలు నిర్వహించారు. సబ్ డివిజన్ పరిధిలోని కిస్మత్పూర్ లో గల పూర్ణ గార్డెన్ లో నిర్వహించిన కార్యక్రమం లో ఉద్యోగుల చేత భద్రత పై తీసుకోవాల్సిన అంశాలను ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ విద్యుత్ సబ్ డివిజన్ ఏ డి ఈ సత్యనారాయణ మాట్లాడుతూ... విద్యుత్ ఉద్యోగులకు విధినిర్మాణ సవాల్ లాంటిదని అందుకోసం జాగ్రత్తగా క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు సేఫ్టీ పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్లు మల్లేష్ రాజ్, దుర్గాప్రసాద్, నవీన్, లైన్ ఇన్స్పెక్టర్లు బాబురావు, వెంకటేశ్వరరావు, రహీం తదితరులు పాల్గొన్నారు.





ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ ఈ చంద్రశేఖర్ , డిఈ రమేష్ చంద్ర





ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

### ఉద్యాన వర్శిటీ స్నాతకోత్సవంలో

## బంగారు పతకాలు సాదించిన విద్యార్థుల మనోగతాలు



నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించిన గుడిసె చైతన్య





కుటుంబ సభ్యులతో గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థినీ లు





రెండు గోల్డ్ మెడల్స్ సాధించిన అచ్యుత మౌనిక శ్రీ నాగిని

బుద్వేల్, జూలై 1(నమస్తే ఉదయం) : రైతాంగానికి ప్రోత్సహకాలు అందించినప్పుడే దేశం అభివృ ది చెందుతుందని ఉద్యాన విశ్వవిద్యాలయం 4వ స్నాతకోత్సవం లో నాలుగు బంగారు పతకాలను సాదించిన గుడిసె చైతన్య అన్నారు. రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాలలో ఉద్యాన డిగ్రీ కోర్సు పూర్తి చేసిన చైతన్య అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఆమెకు నాలుగు గోల్డ్ మెడల్స్ వచ్చాయి. ఈ సందర్భంగా ఆమెను నమస్తే ఉదయం పలుకరించగా నాలుగు గోల్డ్ మెడల్స్ రావడం చాలా సంతోషంగా ఉ ఒదన్నారు. మేము హైదరాబాద్ శంకర్నగర్లో ఉంటామని, నాన్న రమణారెడ్డి ప్రైవేటు ఉంద్యోగి అని, అమ్మ పద్మ గృహిణీ అని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం సం పాదించడమే తన ముందున్న కర్తవ్యం అన్నారు. దేశంలో మహిళా రైతులకు మరిన్ని ప్రోత్సహాలు అందిస్తే మంచిదన్నారు.

**మంచి శాస్త్రవేత్తగా కావాలని ఉంది : అచ్యుత మౌనిక శ్రీ నాగిని**

ఉద్యాన విశ్వవిద్యాలయం నాలుగవ స్నాతకోత్సమంలో రెండు బంగారు పతకాలను సాదించిన తాడేపల్లిగూడెం కు చెందిన అచ్యుత మౌనిక శ్రీ నాగిని మంచి శాస్త్రవేత్తగా ఎదగాలన్నదే తన ఆశయం అన్నారు. నాన్న కలికిమూర్తి సాధారణ రైతు అని, అమ్మ అనంతలక్ష్మి గృహిణీ అని తెలిపారు. తాను ప్రస్తుతం ఫ్లోరీ కల్చర్, ల్యాండ్ స్కేపింగ్ లో పీహెచ్డీ చేస్తున్నానన్నారు. మంచి శాస్త్రవేత్తగా ఎదిగి రైతులకు మేలు చేయడమే తన కర్తవ్యం అన్నారు.



జి ముకేష్

## అనుమానస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి

బుద్వేల్, జూలై 1(నమస్తే ఉదయం):అనుమానస్పద స్థితిలో ఓ వ్యక్తి హిమాయత్ సాగర్ జలాశయంలో సోమవారం శవమై తేలాడు. రాజేంద్రనగర్ ఇన్స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి. ఉప్పరపల్లి లో నివాసముంటున్న జి.ముఖేశ్(35) భార్యతో కొంత కాలంగా వేరుగా ఉంటున్నాడు. ఇతను దృష్టి మరల్చి పలువురిని మోసం చేసిన కేసులలో నిందితుడుగా ఉన్నాడు. నాలుగు రోజుల క్రితం కిస్మత్ పూర్ లో ఓ మెడికల్ షాప్ లో రూ. 75వేలు తన ఖాతాలో జమ చేయించుకుని అతనికి డబ్బులు ఇవ్వకుండ కనిపించకుండ -పోయాడు. మెడికల్ షాప్ నిర్వాహకులు ముఖేశ్ పై రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది జరిగిన తర్వాత సోమవారం ముఖేశ్ హిమాయత్ సాగర్ జలాశయం లో శవమై కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ముఖేశ్ తల్లి లలిత కు సమాచారం ఇవ్వగా ఆమె వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన కుమారుడు అనుమానస్పద స్థితిలో మరణించాడని పేర్కొం ది. కేసు నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు ఇన్స్ పెక్టర్ క్యాస్ట్రో పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నారు.





డాక్టర్స్ డే సందర్భంగా రామయ్య హాస్పిటల్స్ నిర్వాహకులు డాక్టర్ సుల్తాన్ అమరేందర్ ను సన్మానిస్తున్న నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాల్వాయి శ్రీనివాస్ నాయి తదితరులు

## డాక్టర్లు దైవంతో సమానం

**పాల్వాయి శ్రీనివాస్ నాయి**

బుద్వేల్, జూలై 1(నమస్తే ఉదయం) : నేషనల్ డాక్టర్స్ డే సందర్భంగా నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు , కిస్మత్ పూర్ వాస్తవ్యులు పాల్వాయి శ్రీనివాస్ నాయి మంగళవారం రామయ్య హాస్పిటల్స్ నిర్వాహకులు డాక్టర్ సుల్తాన్ అమరేందర్ తో పాటు జనతా హృదయాలయ ఫౌండేషన్ కు చెందిన డాక్టర్ మల్ రెడ్డి హనుమంత్ రెడ్డి లను సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ వైద్య వృత్తి చాలా ప్రధానమైనది అన్నారు.



జనతా హృదయాలయ ఫౌండేషన్ కు చెందిన డాక్టర్ మల్ రెడ్డి హనుమంత్ రెడ్డి ని సన్మానించిన పాల్వాయి శ్రీనివాస్ నాయి

# టీజీ ఎస్పీడీసీఎల్ నూతన డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలిపిన
# విద్యుత్ కార్మిక సంఘం నాయకులు



ఫైనాన్స్ డైరెక్టర్ కృష్ణారెడ్డి సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు



డైరెక్టర్ (ఆపరేషన్) నరసింహులను సన్మానిస్తున్న నాయకులు



కమర్షియల్ డైరెక్టర్ చక్రపాణికి శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యుత్ కార్మిక సంఘం నాయకులు

హైదరాబాద్, జూలై 1 (నమస్తే ఉదయం) టీజీ ఎస్పీడీసీఎల్ నూతన డైరెక్టర్లుగా నియమితులైన కృష్ణారెడ్డి, నరసింహులు, చక్రపాణిలను మంగళవారం తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.నూతన డైరెక్టర్లు (ఫైనాన్స్) డైరెక్టర్ గా కృష్ణారెడ్డి, డైరెక్టర్ ( ఆపరేషన్) గా నరసింహులు, డైరెక్టర్(కమర్షియల్) చక్రపాణి ని, ప్రాజెక్ట్ ( డైరెక్టర్) శివాజీ లను వారి చాంబర్లలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కంపెనీ కార్యవర్గ సభ్యులు,అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు,ముఖ్య నాయకులు కలిసి వారికి పుష్పగుచ్ఛం అందజేసి యూనియన్ డైరి, యాదాద్రి లక్ష్మీ నరసింహా స్వామివారి ప్రసాదం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



## వరల్డ్ బుక్ రికార్డు సాధించిన వేదార్థ్ వడ్లూరిని అభినందించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

వరంగల్ జులై 1 (నమస్తే ఉదయం బ్యూరో):వరల్డ్ బుక్ రికార్డు సాధించిన వేదార్థ్ వడ్లూరిని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అభినందించారు. హుజురాబాద్ కు చెందిన వేదార్థ్ వడ్లూరి 143 పేజీల స్కోరాబ్ లస్టస్ లవ్ పుస్తకాన్ని రచించి వరల్డ్ బుక్ రికార్డు సాధించారు. మంగళవారం హన్మకొండ ఎంపీ క్యాంపు కార్యాలయంలో వరల్డ్ బుక్ రికార్డు సాధించిన వేదార్థ్ వడ్లూరిని ఎంపీ డా.కడియం కావ్య శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... చిన్న వయస్సులోనే వేదార్త్ అసాధారణమైన కవితా ప్రతిభను ప్రదర్శించి, ప్రేమ యొక్క సారాన్ని సంగ్రహించి రాయడం గొప్ప విషయం అన్నారు. అతని రచన భావోద్వేగాలు, మానవ సంబంధాల అందాన్ని అన్వేషిస్తుందన్నారు. వేదార్త్ భాషపై పాండిత్యం పదాలు పాఠకులను మంత్రముగ్ధులను చేస్తుందన్నారు. ఇది ఔత్సాహిక కవులు రచయితలకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. జీవితంలో ఇంత చిన్న దశలో కవిత్వం పట్ల వేదార్త్ కు ఉన్న అంకితభావం అతనికి ఇంతటి గుర్తింపును సంపాదించిపెట్టిందని తెలిపారు. భవిష్యత్తులో గొప్ప రచయితగా మరింత పేరు ప్రఖ్యాతలు సాధించాలని వేదార్త్ ను ఎంపీ డా.కడియం కావ్య ప్రోత్సహించారు.



## కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీపాదరెడ్డి**

కేటిదొడ్డి, జూలై 1 (నమస్తే ఉదయం)ప్రధాని మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందని బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీపాదరెడ్డి అన్నారు. మంగళవారం కేటిదొడ్డి మండల వెంకటాపురం గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీపాద రెడ్డి అధ్యక్షతన రచ్చబండ కార్యక్రమానికి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ మూడోసారి కావడం మరియు 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన దేశానికి చేసిన అభివృద్ధి పనుల గురించి తెలియపరచడమే రచ్చబండ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు. అవినీతికి అవకాశం ఇవ్వకుండా దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న గొప్ప నాయకుడు అని అన్నారు. బేటీ పడావో.. బేటీ బచావో పథకంతో మొదలుకొని పేదలకు మరుగుదొడ్ల నిర్మాణం, రాయితీ గ్యాస్ సిలిండర్లు, ఆయుష్మాన్ భారత్, ఉచిత బియ్యం ఇలా అనే పథకాలను కేంద్రం అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం గోవిందు,వెంకటేష్, కేటి దొడ్డి మండల ఎస్సీ మోర్చా ముని, కేటి దొడ్డి యూత్ నాయకులు కృష్ణకాంత్ ,రంగప్ప,గోపాల్ గ్రామ పెద్దలు , తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ వందేళ్ల పోరాటం పేదలకోసమే చేసింది

**కమ్యూనిస్టులు లేని ప్రాంతాల్లో ఉన్నోళ్లదే రాజ్యం**

**సిపిఐ జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయండి**

**ఎర్రవల్లి, ఇటిక్యాలా మండలాల మహాసభలల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి బి ఆంజనేయులు**




ఎర్రవల్లి, జూలై 1(నమస్తే ఉదయం) నిరంతరం సామాన్య ప్రజల గురించి అలోచించి పోరాటాలు చేస్తున్న పార్టీ భారత దేశంలో సిపిఐ పార్టీ మాత్రమేనని సీపీఐ జిల్లా కార్యదర్శి బి ఆంజనేయులు అన్నారు.మంగళవారం జింకలపల్లి అషన్న అధ్యక్షతన జరిగిన ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల సిపిఐ మహాసభల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ వందేళ్ల పోరాటంలో ఎన్నో విజయాల త్యాగాల చరిత్ర సిపిఐ కి మాత్రమే ఉందనే చారిత్రక వాస్తవాన్ని ప్రజలు తెలుసుకొని ఎర్రజెండాలో చేరినప్పుడే మేలు జరుగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి ఆంజనేయులు పేర్కొన్నారు. ఈసందర్భగా ఆంజనేయులు మాట్లాడుతూ... భారత కమ్యునిస్టు పార్టీ (సీపీఐ) 1925నుండి నేటివరకు వందేళ్ళుగా పెదాల జీవితాల్లో వెలుగులు నింపాలని పోరాడిందని, కమ్యూనిస్టులు లేని గ్రామాల్లో ప్రాంతాల్లో ఉన్నోళ్లదే రాజ్యమని అందుకే ప్రతి ఊరిలో ఎర్రజెండా పార్టీలు ఉండాలని అభిప్రాయపడ్డారు . ప్రతి ఒక్కరూ గ్రామాల్లో మండలాల్లో పార్టీ సభ్యత్వం తీసుకొని కమిటీలు ఏర్పాటు చేసి ప్రజలకోసం పోరాడాలని పిలుపుచ్చారు, ఈనెల 23వ, 24వ తేదీన జరిగే సిపిఐ జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సిపిఐ మండలాల కమిటీని ఏర్పాటు చేయటం జరిగింది. ఎర్రవల్లి మండల సిపిఐ కార్యదర్శి గా శివకుమార్, సహాయ కార్యదర్శులుగా జయరాం, కుర్మాన్న, పర్శరము,కమిటీ సభ్యులుగా 7మందిని ఎన్నుకున్నారు. ఇటిక్యాల మండల కార్యదర్శిగా బి అశన్న, కార్యవర్గ సభ్యులు గా లోకేష్, వెంకటేష్, బొజ్జయ్యలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు ఆశాన్న,సిపిఐ జిల్లా సమితి సభ్యులు రంగన్న, ఆయులన్న నాయుడు, పరుష రాముడు, శివ, యాదగిరి, మరో 30మంది సభ్యులు పాల్గొన్నారు.




## రాందేవ్ రావ్ ఆసుపత్రిలో ఘనంగా వైద్యుల దినోత్సవ వేడుకలు

**తల్లి దండ్రులు జన్మనిస్తే, వైద్యులు పునర్జన్మనిస్తారు...**

**వైద్యాన్ని వైద్యో నారాయనో హరి**

**సమాజానికి సేవ చేయడం లో రాందేవ్ రావ్ ఆసుపత్రి ముందుంటుంది.**

కూకట్‌పల్లి, జూలై 1(నమస్తే ఉదయం) తల్లి దండ్రులు జన్మనిస్తే, వైద్యులు పునర్జన్మనిస్తారు. వైద్యులు తమ ప్రాణం పోతుందని తెలిసి కూడా తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా రోగుల కొరకు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి వైద్యం చేస్తారు. అందుకే వైద్యాన్ని వైద్యో నారాయనో హరి అంటారు. వైద్య%శీ% ఒక వృత్తి గా కాకుండా ప్రాణాలను కాపాడే ఒక మహోన్నత శక్తి గా వైద్యాన్ని అభివర్ణింస్తుంటారు. రాందేవ్ రావ్ ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులందరికీ వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు. ఈ 2025 సంవత్సరం నినాదం బిహండ్ ద మాస్క్ హూ హెల్స్ ది హెలర్స్? అనే నినాదం తో వైదలందర్నీ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమనికి అదునపు ఆకర్షణ గా ప్రముఖ రేఖి తెరేపిస్ట్ గ్రాండ్ మాస్టర్ లక్ష్మి కమలాకర్ వన్నె తీసుకొని వచ్చారు. ఈ కార్యక్రమం లో రాందేవ్ రావు ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ కమలాకర్ ని, ప్రముఖ స్త్రీ నిపుణురాలు చేయదేవి ని, ఇతర వైద్యులను ఘనంగా సత్కరించారు. అందరికి ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉంటే, కుటుంభం, కుటుంబం తో పాటు సమాజం, సమాజం తో పాటు ఊరు, ఊరు తో పాటు దేశం కూడా ఆరోగ్యం గా ఉంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమం లో సమాజానికి మరింత చేరువయ్యే సేవలను రాందేవ్ రావు ఆసుపత్రి ప్రారంభించినట్లు ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ కమలాకర్ తెలిపారు. ఈ కార్యక్రమం లో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సంస్కృతి నుండి ప్రెసిడెంట్ లయన్ సుష్మ, సుజాత, సూర్యారాజు పాల్గొన్నారు. ఆదరణ ఫౌండేషన్ తరుపున ఆరిగెల రఘునాథ్ బాబు, జగన్ ఎర్రవెల్లి, పెరి ప్రసాద్, నరేంద్ర పాల్గొని వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు.



## ఘనంగా సురభి రవీందర్రావు జన్మదిన వేడుకలు

**శుభాకాంక్షలు తెలిపిన వడ్డేపల్లి రాజేశ్వరరావు, రవి కుమార్ యాదవ్**

కూకట్‌పల్లి, జూలై 1(నమస్తే ఉదయం) బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలని ఎస్ ఎస్ డి గ్రామర్ హై స్కూల్ వ్యవస్థాపకులు సురభి రవీందర్ రావు పుట్టిన రోజు వేడుకలు, ఎస్ ఎస్ డి గ్రామర్ హై స్కూల్ లో మంగళవారం ఘనంగా జరిగాయి. పుట్టిన రోజు వేడుకలకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు, శేరిలింగంపల్లి నియోజకవర్గం బిజెపి నాయకులు ఎం రవికుమార్ యాదవ్ లు హాజరై శాలువాతో సత్కరించి, పుష్ప గుచ్ఛం అందజేసి, కేక్ కట్ చేయించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు నిండు నూరేళ్ళు జరుపుకుని, పార్టీ లోనూ, రాజకీయంగా ను ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుతూ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మిత్రులు భారీ సంఖ్యలో పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## అభివృద్ధి చేసే అధికారులకు సహకరించాలి

**పాపిరెడ్డినగర్ అధ్యక్షుడు చంద్రారెడ్డి**

కూకట్‌పల్లి, జూలై 1(నమస్తే ఉదయం) అభివృద్ధి పనులు చేపట్టే అధికారులకు బస్తి వాసులు సహకరించాలని కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి తెలిపారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కూకట్ పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ఆదేశాలతో బస్తీలోని పార్క్ సమీపంలో గల రోడ్డు నిర్మాణం కోసం అధికారులు తమ సిబ్బంది చేత మట్టి కుప్పలను ఇతర వ్యర్థాలను తొలగిస్తూ రోడ్డు వేసేందుకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్న పనులను మంగళవారం బస్తి వాసులతో కలిసి అధ్యక్షుడు చంద్రారెడ్డి పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ రోడ్డు పనులను సకాలంలో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. నిధులను కేటాయిస్తూ పనులను పూర్తి చేయిస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులకు చంద్రారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, నేతలు రఘు, చారి తదితరులు పాల్గొన్నారు.

## ఆవిష్కరణలు, స్థిరమైన అభివృద్ధికి

# రాయబారులుగా విద్యార్థులు ఉండాలి







ఉద్యాన విశ్వవిద్యాలయం లో జరిగిన స్నాతకోత్సవం లో విద్యార్థులనుదేశించి మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాంశు పాఠక్

ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి




నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించిన గుడిసె చైతన్య

### తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపు

బుద్వేల్, జులై 1(నమస్తే ఉదయం): జ్ఞానం, ఆవిష్కరణలు, స్థిరమైన అభివృద్ధికి రాయబారులుగా విద్యార్థులు ఉండాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపునిచ్చారు. వాతావరణ మార్పు, పంటకోత తర్వాత నష్టాలు, మార్కెట్ అస్థిరత వంటి అత్యంత ముఖ్యమైన ఉద్యానవన సవాళ్లను ఎదుర్కోవడానికి అనుకూల విధానాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, బలమైన భాగస్వామ్యాలు ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగిన శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం నాల్గవ స్నాతకోత్సవంలో గవర్నర్, ఛాన్సలర్ ల ప్రసంగం చేశారు. భారతదేశం మరింత, స్థిరంగా అభివృద్ధి చెందాల్సిన అవసరాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నొక్కిచెప్పారని గవర్నర్ అన్నారు. 353 మిలియన్ టన్నులకు పైగా ఉద్యాన ఉత్పత్తితో, భారతదేశం ప్రపంచ నాయకుడిగా నిలుస్తోంది. పండ్లు, కూరగాయలలో చైనా తర్వాత రెండవ స్థానంలో ఉంది. అరటి, మామిడి, బొప్పాయి ఉత్పత్తిలో మనం ప్రపంచంలోనే ముందున్నాం. ఉల్లిపాయలు, అల్లం, బెండకాయల ఉత్పత్తిలో అగ్రస్థానం మనది. అలాగే తెలంగాణ ఉద్యాన శక్తి కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. 12.94 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణంలో ఉన్న ఉద్యానవన పంటలు 61.64 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో, ఈ రంగం రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తిలో 34% వాటాను కలిగి ఉందని, ఇది కేవలం వ్యవసాయ విస్తీర్ణంలో కేవలం 7% మాత్రమే అన్నారు. తెలంగాణ మిరప ఉత్పత్తిలో రెండవ స్థానంలో , పసుపులో మూడవ స్థానంలో ఉంది. మామిడి పండ్లు భారతదేశం అంతటా, విదేశాలకు ఎగుమతి చేయబడుతున్నాయి' అని ఆయన తెలిపారు. ములుగు జిల్లా ఎస్. తడ్వాయి మండలంలో ఉన్న కొండపర్తి అనే గిరిజన గ్రామాన్ని దత్తత తీసుకున్న రాజ్ భవన్ రైతులకు సహాయం చేయడానికి విశ్వవిద్యాలయం ఆఫ్ క్యాంపస్ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని సాంకేతిక సహాయాన్ని అందించాలని ఆయన కోరారు. ఈ గ్రామం కారం, పసుపు, ఇతర సుగంధ ద్రవ్యాల మిశ్రమాలను ఉత్పత్తి చేయగల మసాలా ప్రాసెసింగ్ యంత్రాల సంస్థాపనకు దోహదపడింది అని తెలిపారు.

అమెరికాలోని అలబామాలోని ఆబర్న్ విశ్వవిద్యాలయంలో ఎం.ఎస్. ప్రోగ్రామ్‌లను అభ్యసించడానికి ఉద్యాన, వ్యవసాయ విశ్వవిద్యాలయాల విద్యార్థుల కోసం ఓవర్సీస్ ఫెలోషిప్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించిన విశ్వవిద్యాలయాన్ని, ప్రభుత్వాన్ని గవర్నర్ ప్రశంసించారు.

స్నాతకోత్వానికి ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్‌లోని పటాన్‌చెరులోని ఇక్రిసాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ మాట్లాడుతూ, భారతదేశం ఆహార కొరత ఉన్న దేశం నుండి స్వయం సమృద్ధి, ఎగుమతి దేశంగా ఎదిగిందని అన్నారు. 'అంతర్జాతీయ ద్రవ్య నిధి అంచనాల ప్రకారం, భారతదేశం 2027 నాటికి ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుంది. అమెరికా, చైనా తర్వాత మాత్రమే వెనుకబడి ఉంటుంది' అని ఆయన అన్నారు. 'సమ్మిళిత వృద్ధి, మెరుగైన రైతుల ఆదాయం, వనరుల స్థిరమైన వినియోగం వైపు మన ప్రాధాన్యతలు మారాలి' అని ఆయన పేర్కొన్నారు. 2016%-%17 నుండి 2022%-%23 వరకు వ్యవసాయం 5శాతం వార్షిక వృద్ధి రేటును నమోదు చేసిందని, ఇప్పుడు భారతదేశ స్థూల విలువ జోడింపుకు దాదాపు 20శాతం దోహదపడుతుందని ఆర్థిక సర్వే 2024%-%25 పేర్కొందన్నారు . సాంకేతిక ఆవిష్కరణలు, సాగు ఖర్చులు, పంటకోత తర్వాత నష్టాలను తగ్గించడం నుండి దిగుబడిని మెరుగుపరచడం, విలువ జోడింపును ప్రారంభించడం వరకు కొత్త పరిష్కారాలను అందిస్తున్నాయి' అని ఆయన చెప్పారు.

వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి. రాజి రెడ్డి స్వాగత ప్రసంగం చేసి విశ్వవిద్యాలయం పురోగతి నివేదికను సమర్పించారు.

**విద్యార్థులకు బంగారు పతకాలు :**

బీ ఎస్సీ (ఆనర్స్) హార్టికల్చర్ లో గుడిసె చైతన్య 4 బంగారు పతకాలు సాధించారు. అవి శ్రీ కొండ లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం బంగారు పతకం, డాక్టర్ హరిబాబు (రిటైర్డ్ ప్రొఫెసర్ హార్ట్) బంగారు పతకం, విశ్వ శాంతి బంగారు పతకం, డాక్టర్ నగేష్ మత్రి, 1983 ఏపీఏయు పూర్వ విద్యార్థి బంగారు పతకం, కొర్ర రోషిణికి ప్లాంట్ ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ , మైక్రోబయాలజీ కోర్సులలో ఓ జీపీఏ టాపర్‌గా నిలిచినందుకుగాను డాక్టర్ కొమ్మ చంద్రశేఖర్ రెడ్డి స్మారక బంగారు పతకం లభించింది. కోతకాపు మౌనికా రెడ్డికి ఉద్యాన కోర్సులలో ఓజీపీఏ టాపర్‌గా గజ్జల లక్ష్మి , బాలి రెడ్డి బంగారు పతకం లభించింది. బీ ఎస్సీ (ఆనర్స్) ఫారెస్ట్రీలో, తొగితా రేణుక, సుదర్శి రమ్య బంగారు పతకాలు సాధించారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ (ఎం.ఎస్.సి. హార్టికల్చర్) లో అచ్చుత మోనిక శ్రీ నాగిని రెండు బంగారు పతకాలు, సింధుజా కె (కూరగాయల శాస్త్రంలో టాపర్‌గా బోగ చంద్రయ్య , గంగు బాయి స్మారక బంగారు పతకం), రంజిత్‌కుమార్ (ప్లాంటేషన్, సుగంధ ద్రవ్యాలు, ఔషధ మరియు సుగంధ పంటలలో టాపర్‌గా కేసర్ అన్నంవర్ స్మారక బంగారు పతకం) బంగారు పతకాలు గెలుచుకున్నారు. ఫ్రూట్ సైన్స్‌లో టాపర్‌గా దిశ ఎస్.కె. నోవా ఐకాన్ బంగారు పతకం గవర్నర్ చేతుల మీదుగా అందుకుంది.

ఈ స్నాతకోత్సవంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ అల్దాస్ జనయ్యబీ వెటర్నరీ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ జ్ఞాన ప్రకాష్, ఐ ఐ ఓ ఆర్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కె మాథుర్‌బీ వర్సిటీ అధికారులు డాక్టర్ ఎ. భగవాన్, డాక్టర్ జె. చీనా, సురేష్, సీనివాసన్, ప్రశాంత్, అకడమిక్ కౌన్సిల్ సభ్యులు, ప్రొఫెసర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మీనా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో

# నెల రోజుల పాటు ఉచిత మెగా హెల్త్ క్యాంప్

బుద్వేల్, జూలై 1(నమస్తే ఉదయం) : శివరాంపల్లి రోడ్డులో గల మీనా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (పిల్లర్ నెంబర్ 254)లో మంగళవారం నుంచి ఈ నెల 31 వరకు ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాన్ని డాక్టర్ హిదయతుల్లా ఖాన్, డాక్టర్ సోహెబా షకూర్ పర్యవేక్షిస్తున్నారు. ఈ శిబిరం అన్ని ప్రధాన విభాగాలలో నిపుణుల సంప్రదింపులు, వైద్య సేవలను అందిస్తుంది. నెల రోజుల పాటు జరిగే ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ మొహమ్మద్ జావాద్ నేతృత్వంలోని జనరల్ మెడిసిన్‌లో ప్రత్యేక సంరక్షణ ఉంటుంది, ఇది డయాబెటిస్, హైపర్‌టెన్షన్, థైరాయిడ్ రుగ్మతలు, ఉబ్బసం, ఆర్థరైటిస్, ఇన్ఫెక్షన్లు మరియు క్రిటికల్ కేర్‌లకు చికిత్స అందిస్తుంది. డాక్టర్ మొహమ్మద్ నకీ జైన్ ఆధ్వర్యంలోని జనరల్ సర్జరీ, లాపరోస్కోపిక్ సర్జరీలు, హెర్నియా, పిత్తాశయం, థైరాయిడ్, రొమ్ము, పైల్స్, ఫిస్టులా, ఫిషర్, సున్తీ మరియు బారియాట్రిక్ విధానాలను కవర్ చేస్తుంది. గర్భధారణ సంరక్షణ, పీసీఓ స్, వంధ్యత్వం, మహిళల ఆరోగ్యాన్ని పరిష్కరిస్తూ ఓ బీ జీ సేవలు 24/7 అందుబాటులో ఉంటాయి. డాక్టర్ రోయిష్ ఉద్దీన్ నేతృత్వంలోని ఆర్థోపెడిక్స్, ఫ్రాక్చర్ మేనేజ్‌మెంట్, ఆర్థ్రోస్కోపీ, జాయింట్ రీప్లేస్‌మెంట్స్ ( టీ కే ఆర్/టీ హెచ్ ఆర్) మరియు కాంప్లెక్స్ ఆర్థోపెడిక్ ఇన్ఫెక్షన్‌లను అందిస్తుంది. యూరాలజీలో, డాక్టర్ వి.వి. రెడ్డి సిస్టోస్కోపీ, యు ఆర్ ఎస్ ఎల్, టి యు ఆర్ పీ, పీ సీ ఎన్ ఎల్ వంటి విధానాలను మరియు రాళ్లు, కణితులు, ఇన్ఫెక్షన్లు, వంధ్యత్వం మరియు ప్రోస్టేట్ సమస్యలకు చికిత్సను అందిస్తారు. డాక్టర్ మజీద్ అలీ అఫ్రోజ్‌తో కలిసి పీడియాట్రిక్స్ ఎన్ ఐ సీ యు నవజాత శిశువుల సంరక్షణ, రోగనిరోధకత, పెరుగుదల ట్రాకింగ్, అంటు వ్యాధి చికిత్స మరియు పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్‌ను అందిస్తుంది. డాక్టర్ అజ్మత్ నేతృత్వంలోని ఈ ఎన్ టీ, చెవి శస్త్రచికిత్సలు, సైనస్ విధానాలు, సెప్టోప్లాస్టీ, టాన్సిలెక్టమీ మరియు థైరాయిడ్ శస్త్రచికిత్సలను కలిగి ఉంటుంది. డాక్టర్ హిదాయతుల్లా ఖాన్ నేతృత్వంలోని ఆప్తాల్మాలజీ కంటి పరీక్షలు, కంటిశుక్లం స్క్రీనింగ్ మరియు కళ్ళజోడుపై 25శాతం తగ్గింపును అందిస్తుంది. డాక్టర్ మొహమ్మద్ ఒమర్ ఫరూక్ నేతృత్వంలోని డెర్మటాలజీ, మొటిమలు, పిగ్మెంటేషన్, సోరియాసిస్, విటిలిగో, పీ ఆర్ పీ బోటాక్స్, ఫిల్లర్లు మరియు కాస్మెటిక్ డెర్మటాలజీ విధానాలను అందిస్తుంది. నెఫ్రాలజీ, డాక్టర్ సయ్యద్ మొహమ్మద్ ద్వారా. అజార్ హసన్ డయాలసిస్, మార్పిడి సంరక్షణ, మూత్రపిండ బయాప్సీలు మరియు కాథెటర్ ఇన్సర్షన్‌లను అందిస్తుంది. డాక్టర్ మహమ్మద్ నవాజ్ నేతృత్వంలోని దంతవైద్యంలో శుభ్రపరచడం, తెల్లబడటం, ఫిల్లింగ్‌లు, రూట్ కెనాల్‌లు, బ్రేస్‌లు, దంతాలు, ఇంప్లాంట్లు మరియు పీడియాట్రిక్ దంత సంరక్షణ ఉన్నాయి. ఈ శిబిరం ఫార్మసీపై 10శాతం ల్యాబ్ పరిశోధనలు మరియు శస్త్రచికిత్సలపై 20శాతం మరియు కళ్ళద్దాలపై 25శాతం తగ్గింపును కూడా అందిస్తుంది. ఈ చౌరవ రోగులు అన్ని ప్రత్యేకతలలో అధిక-నాణ్యత, సరసమైన సంరక్షణను పొందేలా చేస్తుంది - అన్నీ ఒకే పైకప్పు క్రింద. ఈ జూలైలో మీ ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడానికి ఈ అవకాశాన్ని కోల్పోకండి. మరిన్ని వివరాల కోసం, దయచేసి 040-35262700, 040-35262701, o91 7396084445, లేదా o91 7396084446 నంబర్లలో మమ్మల్ని సంప్రదించండి మరియు శివరాంపల్లి లోని పిల్లర్ నంబర్ 254లోని మీనా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో సంప్రదించవచ్చు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మీనా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్లు



## గంగా హాస్పిటల్‌లో డాక్టర్స్ డే దినోత్సవ వేడుకలు

వరంగల్ జూలై 1 (నమస్తే ఉదయం బ్యూరో):వరంగల్ నగరంలోని వెంకట్రామా జంక్షన్ సమీపంలో ఉన్న గంగా హాస్పిటల్ లో డాక్టర్ గైనకాలజిస్ట్ దిడ్డి స్వప్న లత ఆర్తో ఆర్థోపెడిక్ డాక్టర్ దిడ్డి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో వైద్యుల దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ... వైద్యుల ను ప్రజలు దేవునిలా కొలుస్తారు. వైద్యులు చేసే వృత్తి కత్తి మీద సాము లాంటిదని అన్నారు. హాస్పిటల్ కు ఎంతోమంది ప్రజలు వైద్యం కోసం వస్తుంటారు. వారికి ముందుగా వైద్యం అందించే విధంగా వైద్యులు చూసుకోవాలని అన్నారు. గంగ హాస్పిటల్ లో చిన్నపిల్లల నుండి మొదలుకొని పెద్దల వరకు అన్ని రకాల వైద్య సదుపాయాలు అందించబడతాయని తెలిపారు. ఈ హాస్పిటల్ లో ఆరోగ్యశ్రీ సౌకర్యం కూడా కలదని తెలిపారు. అదేవిధంగా స్త్రీలకు ప్రత్యేకమైన స్త్రీల వైద్య నిపుణుల చే వైద్యం అందించబడునని అన్నారు. వర్షాకాలంలో డెంగ్యూ మలేరియా చలి జ్వరం లాంటి వ్యాధులు వస్తూ ఉంటాయి. ఇంటి చుట్టు ప్రాంతాలలో శుభ్రంగా ఉంచుకునే విధంగా ఉండాలని అన్నారు. గంగా హాస్పిటల్ యాజమాన్యం 24 గంటలు వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగా హాస్పిటల్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.



## యోగా చేయడం శారీరకంగా మానసికంగా ఎంతో ఉపయోగం

**చైర్మన్ డాక్టర్ ముక్క దిలీప్ కుమార్ వెల్లడి**

వరంగల్ జులై 1 ( నమస్తే ఉదయం బ్యూరో):ప్రముఖ వైద్యులు పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బాదన్ చంద్రామ్ పుట్టినరోజు పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా డాక్టర్స్ డే నిర్వహిస్తున్నట్లు కీర్తి చైల్డ్రెన్స్ హాస్పిటల్ చైర్మన్ ముక్క దిలీప్ కుమార్ మీడియాకు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన నగర ప్రజలకు డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రతిరోజు యోగా చేయడం వల్ల శారీరకంగా మానసికంగా ఎంతో దోహదపడుతుందని కీర్తి హాస్పిటల్ చైర్మన్ ముక్క దిలీప్ కుమార్ (పిల్లల వైద్య నిపుణులు) అన్నారు.డాక్టర్స్ డే పురస్కరించుకుని హాస్పిటల్లో స్త్రీలకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా స్త్రీలకు,గర్భిణీలకు సంబంధించి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు.



## పేద ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంది

**టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్**

కూకట్‌పల్లి, జూలై 1(నమస్తే ఉదయం) పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కోట్ల రూపాయలతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. పేద ప్రజలకు నష్టం కలిగించే ఎలాంటి చర్యలను ప్రభుత్వం తీసుకోదన్నారు. కూకట్ పల్లి లో ఉన్న నల్లచెరువులో కోట్ల రూపాయలతో ప్రభుత్వం ఇటీవల సుందరీ కరణపనులను చేపట్టింది. ఇక్కడ జరుగుతున్న పనుల తీరును రమేష్ స్థానిక నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్ల చెరువును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం జరుగుతుందని వాకింగ్ ట్రాక్, జాగింగ్ ట్రాక్, గ్రీనరీ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గతంలో ఇక్కడ ఉన్న నాయకులు చెరువులు, నాళాలు, ఎఫ్ టి ఎల్ ప్రాంతాలను దొంగ డాక్యుమెంట్లు సృష్టించి కబ్జా చేసి అమ్ముకొని సొమ్ము చేసుకున్నారని ఆయన ధ్వజమెత్తారు. 33 ఎకరాలు ఉన్న ఈ చెరువు ప్రస్తుతం చాలా వరకు కబ్జాకు గురైంది అన్నారు. భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని ఉన్న చెరువునైనా కాపాడాలని ఉద్దేశంతో ఈ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఎఫ్ టి ఎల్ పరిధిలో ఎవరికైనా నిజంగా డాక్యుమెంట్స్ ఉంటే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. హైడ్రా కమిషనర్ గతంలో చెరువును పరిశీలించి కబ్జాకు గురైనట్లు ధ్రువీకరించారు. నియోజకవర్గ పరిధిలోని చెరువులను ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలోనియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మార్కెటింగ్ కమిటీ మెంబెర్స్, టెంపుల్ కమిటీ మెంబర్స్, బ్లాక్ అధ్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు , యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, మైనారిటీ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు, బీసీ సెల్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.